సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం । 7 । జనవరి । 2023



క్షీరారామంలో చండీ హోమం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం (క్షీరారామం)లో శుక్రవారం పౌర్ణమి సందర్భంగా చండీహోమం నిర్వహించారు.



అన్నాభిషేకం

పెనుమంట్ర: ధనుర్మాసం పౌర్ణమి ఆరుద్ర నక్షత్రం సందర్భంగా జుత్తిగలోని ఉమావాసుకి రవి సోమేశ్వరస్వామి ఆలయంలో అన్నాభిషేకం, సువర్ణ జలాభిషేకం నిర్వహించారు.

విశేష అలంకరణ



తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలో అమ్మవారిని రజత చీర, పూలతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

న్యూస్‌రీల్

గ్రూప్‌-1 పరీక్షలకు నిబంధనలు తప్పనిసరి



డీఆర్వో దాసి రాజు

సాక్షి, భీమవరం: పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఈనెల 8న నిర్వహించే గ్రూప్‌-1 పరీక్షలకు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని డీఆర్వో దాసి రాజు శుక్రవారం తెలిపారు. ఆదివారం రెండు షిఫ్టుల్లో నిర్వహించే పరీక్షలకు ఉదయం 9.45, మధ్యాహ్నం 1.45 గంటల వరకు మాత్రమే అభ్యర్థులను పరీక్షా హాలులోనికి అనుమతిస్తారన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ ఫొటో గుర్తింపుకార్డు తప్పక తీసుకురావాలని, సెల్‌ఫోన్, కాలిక్యులేటర్, ఎల్రక్టానిక్ పరికరాలు వంటివి అనుమతించరని స్పష్టం చేశారు. తప్పనిసరిగా మాస్క్ ధరించాలని, పరీక్ష పూర్తయ్యేవరకు బయటకు అనుమతించరన్నారు. సందేహాల నివృత్తికి ఫోన్ 08816 299189 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు 12 కేంద్రాలు

సాక్షి, భీమవరం: వచ్చేనెల 5న జరిగే నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్ (ఎన్‌ఎంఎంఎస్)కు జిల్లాలో 12 పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నట్టు డీఈఓ ఆర్.వెంకటరమణ తెలిపారు. భీమవరంలో పొట్టి శ్రీరాములు మున్సిపల్ గరల్స్ హైస్కూల్, ఏఆర్‌కేఆర్ మున్సిపల్ స్కూల్, ఝాన్సీలక్ష్మీబాయి మున్సిపల్ స్కూల్, ఎస్‌సీహెచ్‌బీఆర్‌ఎం స్కూల్, చినరంగడిపాలెంలో ఎంపీఎల్ హైస్కూల్, లూథరన్ హైస్కూల్, నరసాపురంలో భాష్యం స్కూల్, శ్రీ చైతన్యస్కూల్, నారాయణ స్కూల్, జె.సికిలే స్కూల్, మిషన్ హైస్కూల్, శ్రీగౌతమి స్కూల్‌లో కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు మాత్రమే అర్హులని, జిల్లావ్యాప్తంగా 2,631 మంది పరీక్షకు హాజరుకానున్నారన్నారు. పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే 9వ తరగతి నుంచి ఇంటర్ సెకండియర్ వరకు నాలుగేళ్ల పాటు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివితే ఏడాదికి రూ.12 వేల చొప్పున స్కాలర్‌షిప్ వస్తుందని చెప్పారు.

జోగయ్య దీక్ష నాటకం



మాట్లాడుతున్న కాపు నాయకులు

మొగల్తూరు: మాజీ ఎంపీ, కాపు సంక్షేమ సంఘం నాయకుడు చేగొండి హరిరామ జోగయ్య చేపట్టిన దీక్షంతా ఓ నాటకమని వైఎస్సార్ సీపీ నాయకుడు, కాపు నాయకుడు, సొసైటీ చైర్మన్ మోటుపల్లి రాంభాస్కరరావు విమర్శించారు. శుక్రవారం మొగల్తూరులోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ జోగయ్య మంత్రిగా, ఎంపీగా ఉన్న సమయంలో కాపులకు ఏంచేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. జోగయ్యను నమ్ముకుని ఆయన వెంట తిరిగి దెబ్బలు కూడా తిన్న కాపు నాయకులను ఏనాడు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. తన హయంలో కాపులకు ఈ మేలు చేశానని చెప్పే ధైర్యం జోగయ్యకు ఉందా అని ప్రశ్నించారు. వృద్ధాప్యంలో ఉన్న ఆయన కాపులకు 5 శాతం రిజర్వేషన్ కావాలంటూ దీక్ష చేపడతానని చెప్పడం కాపులను అమాయకులను చేయడమేనన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కాపులకు వచ్చిన నష్టమేదీ లేదని, రాష్ట్రంలో కాపులకు న్యాయం జరిగిందంటే అది వైఎస్సార్ సీపీ పాలనలోనే అని స్పష్టం చేశారు. దయచేసి కాపులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయవద్దని హితవు పలికారు. కాపు నాయకులు కొత్తపల్లి సూరిబాబు, తన్నీడి గిరి, లక్కు బాలాజీ పాల్గొన్నారు.

బైజూస్ ప్రశ్నలతో పరీక్షలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సమ్మెటివ్ అసెస్‌మెంట్ పరీక్షల్లో భాగంగా 8వ తరగతి విద్యార్థులకు నిర్వహించే గణితం, జనరల్ సైన్స్ సబ్జెక్టులకు సంబంధించి పరీక్షా ప్రశ్నపత్రాలను విద్యార్థులకు ఇప్పటికే ప్రభుత్వం అందించిన బైజూస్ ట్యాబ్‌ల్లో ఉన్న ప్రశ్నల నుంచి రూపొందించినట్టు జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖాధికారి డి.మధుసూదనరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని అన్ ఎయిడెడ్ పాఠశాలలు మినహా మిగిలిన అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులకు ఈనెల 9న గణితం, 10న జనరల్ సైన్స్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. కాగా సమ్మెటివ్ అసెస్‌మెంట్ పరీక్షల కోసం ఇప్పటికే ప్రధానోపాధ్యాయులకు పంపిన గణితం, జనరల్ సైన్స్ ప్రశ్నపత్రాలను ఈ పరీక్షల అనంతరం విద్యార్థులతో ప్రాక్టీస్ చేయించాలని సూచించారు. అలాగే ఈనెల 7న 8వ తరగతి విద్యార్థులకు సోషల్ స్టడీస్ పరీక్ష నిర్వహించాలని ఆదేశించారు. ఈ మేరకు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని ఉప విద్యాశాఖాధికారులు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు, మండల విద్యాశాఖాధికారులు తమ పరిధిలోని పాఠశాలల్లో పరీక్షలు జరిగే సమయంలో తనిఖీలు చేయాలని ఆదేశించారు.

సేవా వలంటీర్లు

- ఆపదలో ఉన్నవారి చెంతకే వెళ్లి పెన్షన్ అందజేత
- దూరాభారం లెక్కచేయకుండా సేవలు
- లబ్ధిదారులతో ప్రత్యేక అనుబంధం
- సచివాలయ ఉద్యోగులు సైతం వీరి బాటలోనే..

జిల్లాలో ఇలా..

గ్రామ సచివాలయాలు	393
వార్డు సచివాలయాలు	122
గ్రామ వలంటీర్లు	6,746
వార్డు వలంటీర్లు	2,487
మొత్తం వలంటీర్లు	9,233



భీమవరం నుంచి రాజమండ్రి వెళ్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లబ్ధిదారుడికి పెన్షన్ అందిస్తున్న వలంటీర్ శాంతికుమారి (ఫైల్)



పాలకొల్లు నుంచి గుంటూరు ఆస్పత్రికి వెళ్లి లబ్ధిదారుడికి పెన్షన్ అందిస్తున్న వలంటీర్లు జ్యోతి, లావణ్య (ఫైల్)



పెనుమంట్ర మండలం ఆలమూరు నుంచి విశాఖ వెళ్లి పెన్షన్ అందిస్తున్న వలంటీర్ జ్యోతి (ఫైల్)

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రజల ముంగిళ్లలోకే ప్రభుత్వ సేవలు అందించేలా ఏర్పాటుచేసిన వలంటీర్ వ్యవస్థ ప్రశంసలు అందుకుంటోంది. ప్రజలకు నేరుగా సేవలందించడంతో పాటు ఆపదలో ఉన్న వారి చెంతకే వెళ్లి వలంటీర్లు ఆపన్నహస్తం అందిస్తున్నారు. దూరాభారం లెక్కచేయకుండా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి, కుటుంబ సభ్యుల ఇళ్ల వద్ద మంచంపై ఉన్న వారికి, కదలలేని స్థితిలో ఉన్న వారికి ప్రతినెలా పెన్షన్ సొమ్ములను అందిస్తూ సేవా భావం చాటుతున్నారు. వలంటీర్లతో పాటు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు సైతం మేముసైతం అంటూ కదులుతున్నారు. జిల్లాకు చెందిన వలంటీర్లు గుంటూరు, విజయవాడ, విశాఖ, రాజమండ్రి, కాకినాడ తదితర దూర ప్రాంతాలకు వెళ్లి మరీ పెన్షన్ అందిస్తున్నారు.

ప్రతి సచివాలయం నుంచీ..

జిల్లాలోని 19 మండలాల్లోని గ్రామ సచివాలయాలు, 6 పట్టణాల్లో వార్డు సచివాలయాలు ఉన్నాయి. మొత్తంగా 515 సచివాలయాల పరిధిలో 9,233 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. ఆయా సచివాలయానికి సంబంధించి ప్రతి నెలా ఒకరు లేదా ఇద్దరు పెన్షన్ లబ్ధిదారులకు దూర ప్రాంతాలకు వెళ్లి వలంటీర్లు పెన్షన్ అందిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన వలంటీర్ వ్యవస్థ ప్రజలకు బాగా చేరువైందని చెప్పడానికి వలంటీర్ల సేవలు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

ఆప్యాయతను పంచుతూ..

దూర ప్రాంతంలో ఉన్న లబ్ధిదారులైన అవ్వాతాత తదితరులకు పెన్షన్ అందించడానికి వెళ్లిన వలంటీర్, సచివాలయ ఉద్యోగులపై వారు ఆప్యాయత, అనురాగాలు చూపుతున్నారు. మంచంపై లేదా ఆస్పత్రిలో ఉన్నా కూడా తమ కోసం వచ్చిన వలంటీర్లను చూసి చెమర్చిన కళ్లతో కృతజ్ఞతలు తెలుపుతున్నారు. వలంటీర్లు వారి యోగక్షేమాలు, ఆరోగ్య సమాచారం తెలుసుకుని ధైర్యం చెబుతున్నారు.

ఉత్తమ సేవలకు సత్కారం

ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తున్న వలంటీర్లను ప్రభుత్వం గుర్తించి ఏటా సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాలతో సత్కరిస్తుంది. ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించేలా ప్రోత్సహిస్తోంది.

చాలా సంతృప్తి



నా క్లస్టర్‌కు చెందిన నాగవెంకటసత్యనారాయణ అనే వ్యక్తి అనారోగ్యంతో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆపదలో ఉన్నారని తెలుసుకుని మరో వలంటీర్ మేకా లావణ్యతో కలిసి ఆయన వద్దకు వెళ్లి పెన్షన్ సొమ్ములు అందించాను. నాకు చాలా సంతృప్తి కలిగింది.

– శెట్టి జ్యోతి, వలంటీర్, పాలకొల్లు

సాయం చేయాలనే..



గత నెలలో నా క్లస్టర్‌లోని పెన్షన్ లబ్ధిదారుడు విజయవాడలో వైద్యం పొందుతుంటే అతని వద్దకు వెళ్లి పెన్షన్ అందించాను. ఆపదలో ఉన్న అతనికి పెన్షన్ అందిస్తే సాయంగా ఉంటుందని భావించాను. దూరాభారం లెక్కచేయకుండా వెళ్లి పెన్షన్ అందించడం నాకు చాలా ఆనందంగా ఉంది.

– ముత్యాల మహిమ జ్యోతి, 39వ వార్డు వలంటీర్, భీమవరం

విజయవాడ వెళ్లి అందించా..



మా సచివాలయం పరిధిలోని బి.బేబి సరోజిని అనే వృద్ధురాలు విజయవాడలో వైద్యం పొందుతున్నారు. ఇక్కడకు వచ్చి పెన్షన్ తీసుకునే పరిస్థితిలో లేరు. దీంతో నేను విజయవాడ వెళ్లి పెన్షన్ అందించాను. ఆమె, ఆమె కుటుంబ సభ్యులు నన్ను, వలంటీర్ వ్యవస్థను మెచ్చుకున్నారు. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

– పాలపర్తి రమేష్, వార్డు వెల్ఫేర్ సెక్రటరీ, భీమవరం

విహరించి.. కటాక్షించి..

తిరువీధుల్లో మెరిసిన శ్రీనివాసుడు



పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న దివ్య క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం జరిగిన స్వామివారి తిరువీధి సేవ భక్తులకు నేత్రపర్వమైంది. ఆలయంలో స్వామి, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించిన తొళక్క వాహనంపై ఉంచి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రధాన రాజగోపురం మీదుగా స్వామివారి వాహనం తిరువీధి సేవకు పయనమైంది. వేద మంత్రోచ్చరణలు, డోలు, సన్నాయి వాయిద్యాలు, అశ్వ, గజ సేవల నడుమ స్వామివారు క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. ప్రతి ఇంటి ముంగిట భక్తులు శ్రీవారికి నీరాజనాలు సమర్పించారు. అనంతరం స్థానిక ధనుర్మాస మండపంలో స్వామి, అమ్మవార్లకు అర్చకులు విశేష పూజలు జరిపి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ద్రవిడ ప్రబంధ అధ్యయనోత్సవాల్లో భాగంగా రాత్రి సైతం శ్రీవారి గ్రామోత్సవం అట్టహాసంగా జరిగింది.

హెల్మెట్ వాడకం తప్పనిసరి

సాక్షి, భీమవరం: ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ఉపయోగించాలని ఎస్పీ యు.రవిప్రకాష్ అన్నారు. శుక్రవారం భీమవరం పట్టణంలోని ఉండి రోడ్డులో ద్విచక్ర వాహనచోదకులకు హెల్మెట్ ప్రయోజనాలను వివరిస్తూ ఆయన అవగాహన కల్పించారు. ఎస్సై పి.అప్పారావు, పోలీసు సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

రక్షణ కౌన్సిల్‌తో సత్వర న్యాయం



న్యాయ సహాయ రక్షణ కౌన్సిల్‌ను ప్రారంభిస్తున్న ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తం కుమార్

ఏలూరు (టూటౌన్): ముద్దాయిలకు త్వరితగతిన న్యాయ సహాయం అందించేందుకు న్యాయ సహాయ రక్షణ కౌన్సిల్ వ్యవస్థను ప్రారంభించినట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ తెలిపారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విభాగాన్ని వర్చువల్ విధానంలో శుక్రవారం స్థానిక జిల్లా కోర్టులో ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆయన జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయ సహాయ రక్షణ కౌన్సిల్ వ్యవస్థను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ క్రిమినల్ కేసుల్లో ముద్దాయిలకు న్యాయసేవలను త్వరితగతిన అందించే ఉద్దేశంతో ఈ వ్యవస్థను ప్రారంభించామన్నారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా పీవీఎన్ మునేశ్వరరావు, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా బి.రామమోహనరావు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా టి.మధును నియమించామని, వీరు న్యాయ సేవలు అందిస్తారన్నారు. అవసరమైన సెషన్స్, క్రిమినల్ కేసుల ముద్దాయిలు ఈ సేవలను ఉపయోగించుకోవాలని అలాగే ఏవిధమైన సలహాలు, సందేహాలు ఉన్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని తెలియజేశారు. మొదటి అదనపు జిల్లా జడ్జి పి.మంగాకుమారి, రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్ ఉమాసునంద, ఎనిమిదో అదనపు జిల్లా జడ్జి ఎం.సునీల్‌కుమార్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి, న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

● ముందే వచ్చిన సంక్రాంతి





భోగి మంటలు.. గంగిరెద్దుల విన్యాసాలు.. చిన్నారుల కోలాటాలు.. తోలు బొమ్మలాటలతో పెద్ద పండగ ముందే వచ్చిందా అన్నట్టు సంబరాలు జరిగాయి. పెదతాడేపల్లి భారతీయ విద్యాభవన్స్‌లో శుక్రవారం ముందస్తుగా సంస్థ చైర్మన్, మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. 32 జానపద కళారూపాలను 72 మంది కళాకారులు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. విద్యావేత్త గుబ్బల తమ్మయ్య, కొలనువాడ పెదకృష్ణంరాజు, కనుమూరి అబ్బాయిరాజు, భవన్స్ ప్రిన్సిపాల్ రాజీవ్‌కుమార్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

-తాడేపల్లిగూడెం

యువతిపై ప్రేమోన్మాది దాడి దురదృష్టకరం

- నిందితుడిని కఠినంగా శిక్షించాలి
- బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది
- మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు
- మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ



ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో బాధితురాలిని పరామర్శిస్తున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ

ఏలూరు టౌన్ : తాడేపల్లిగూడెం మండలం కొండ్రుప్రోలు గ్రామంలో ప్రేమోన్మాది దాడి ఘటన దురదృష్టకరమని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ అన్నారు. శుక్రవారం ఏలూరు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. దాడికి దారితీసిన సంఘటనల పూర్వాపరాలను కుటుంబ సభ్యులను, పోలీసులను అడిగి తెలుసుకున్నారు. ప్రేమను అంగీకరించలేదనే అక్కసుతో అదే గ్రామానికి చెందిన గాజులపాటి కల్యాణ్ అనే యువకుడు మాణిక్యం అనే యువతితో పాటు ఆమె తల్లి, సోదరిపై విచక్షణారహితంగా దాడిచేశాడని, ఈ కేసులో వేగంగా దర్యాప్తు జరపాలని పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రేమోన్మాదిపై చార్జిషీట్ వేసి హత్యాయత్నం కింద కేసు పెట్టడంతో పాటు రౌడీషీట్ కూడా తెరవాలని జిల్లా ఎస్పీని కోరినట్టు ఆమె చెప్పారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం, మహిళా కమిషన్ అండగా ఉంటాయన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తామన్నారు. బాధితురాలి ముఖంపై చిన్న మచ్చ కూడా లేకుండా ప్రభుత్వ సాయంతో పూర్తి వైద్య సదుపాయం కల్పిస్తున్నామన్నారు. చట్టం, ప్రభుత్వం ఆడపిల్లకు అండగా ఉంటుందని, ప్రభుత్వం దృష్టికి ఈ సమస్య తీసుకువెళతానని చెప్పారు. ఆడ పిల్లలు వారి కాళ్లపై వారు నిలబడాలని చూస్తుంటే కొందరు ఓర్వలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయ మహిళా పోలీసులు మహిళల రక్షణ కోసం ఉన్నారని, వారు చేస్తున్న సర్వేను సైతం కొందరు అడ్డుకుంటూ విమర్శలు చేస్తున్నారన్నారు. మహిళా పోలీసులు వెళ్లి కుటుంబంలో ఎవరైనా మద్యం సేవిస్తూ మహిళలను వేధిస్తున్నారా అని ప్రశ్నలు అడిగితే.. లేని ప్రశ్నలు అడిగారని ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాయని వాసిరెడ్డి పద్మ అన్నారు. ప్రేమ పేరుతో యువతులను ఎవరైనా వేధించినా, వెంటబడుతున్నా వెంటనే దిశ యాప్, మహిళా పోలీసులు, వలంటీర్ల దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు. మహిళా కమిషన్ సభ్యురాలు బూసి వినీత, ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయ్‌కుమార్, ఏలూరు డీఎస్పీ పైడేశ్వరరావు, ఐడీసీఎస్ పీడీ పి.పద్మావతి, ఎస్సైలు ఎస్.శ్రీనివాసరావు, కె.ప్రసాద్, డీసీపీఓ సూర్యచక్రవేణి ఆమె వెంట ఉన్నారు.

కోడిపందేలను ఉపేక్షించం

ఎస్పీ రవిప్రకాష్

భీమవరం అర్బన్: సంక్రాంతి అంటే కోడిపందేలు, పేకాట, ఇతర జూదాలు కాదని హిందూ సంప్రదాయం ప్రకారం కుటుంబసమేతంగా వేడుకలు నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ అన్నారు. మండలంలోని అనాకోడేరు, తొకలిప్ప, లోసరి, యనమదుర్రు, తాడేరు, కొవ్వాడ అన్నవరం, తదితర గ్రామాల్లో గతేడాది కోడిపందేలు నిర్వహించిన స్థలాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడిపందేలు, పేకాట, గుండాట వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నిర్వహించినా, ప్రోత్సహించినా చర్యలు తప్పవని, యువత వాటి జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. గతంలో కోడిపందేలు నిర్వహించిన నిర్వాహకులకు, స్థల యజమానులకు నోటీసులు ఇచ్చామని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలు కోడి పందేలు, పేకాట, గుండాట తదితర జూదాల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రూరల్ గ్రామాల ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగితే ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. రూరల్ సీఐ సీహెచ్ నాగప్రసాద్, రూరల్ ఎస్సై వి.అప్పలరాజు, పోలీస్ సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

భీమవరంలో ముగ్ధ షోరూం ప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరంలో ముగ్ధ కంచి పట్టు చీరల షోరూంను శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల వస్త్రాలంకరణ ఒక సంప్రదాయమని, భారతీయ సంస్కృతిలో కట్టుబొట్టు ప్రధానమని, చీరలు కట్టడంలో కూడా కొన్ని సంప్రదాయాలు ఉన్నాయన్నారు. చీరకు ఉన్న అందం ప్రత్యేకమని, కాంచీపురం లాంటి పట్టు చీరలను ఈ ప్రాంతానికి తీసుకునిరావడం ఆనందంగా ఉందన్నారు. షోరూం ఎండీ వంగపల్లి శశిభవాని, సందీప్ సాంబరి, రీజనల్ మేనేజర్ నవీన్, పవన్‌కుమార్ మాట్లాడుతూ భీమవరంలో 23వ బ్రాంచ్‌గా ప్రారంభించామని, సామాన్యులకు కూడా కంచి పట్టు చీరలను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, తోట భోగయ్య, నల్లం రాంబాబు, తటవర్తి కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాప్టో కార్యవర్గం ఏకగ్రీవం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్ (ఫ్యాప్టో) ఏలూరు జిల్లా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగరంలోని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకుడు, ఫ్యాప్టో రాష్ట్ర కో-చైర్మన్ బి.మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా చైర్మన్‌గా ఎస్‌టీయూ నాయకుడు పీబీవీఎస్ ఎల్ నారాయణ, సెక్రటరీ జనరల్‌గా బీటీఏ నాయకుడు జి.వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కో-చైర్మన్లుగా డీటీఎఫ్ నాయకుడు ఎం.ఆదినారాయణ, ఎస్‌డీ జిలానీ, డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా పీవీ నరసింహరావు, ఏపీటీఎఫ్ 257 నాయకుడు ఎస్‌కే రంగావలి, ఏపీటీఎఫ్ 1938 నాయకుడు గుగ్గులోతు కృష్ణ, కోశాధికారిగా పీవీఎల్ రామారావు, కార్యవర్గ సభ్యులుగా ఆర్.రవికుమార్, ఆర్.ప్రకాష్‌రావు, బి.రెడ్డిదొర, జి.రాంబాబు, పి.సురేష్, సీహెచ్ శివరాం, బీహెచ్‌పీ సాయిరాజు, కె.కాంతారావు ఎన్నికయ్యారు.

పందెం పుంజులకు రాజభోగం

సంక్రాంతి బరిలో దిగేందుకు సిద్ధమవుతున్న పందెం పుంజులు
ప్రత్యేక శిక్షణ, బలవర్ధక ఆహారం అందిస్తున్న పెంపకందారులు




పచ్చకాకి పుంజు



ద్వారకాతిరుమల : సంక్రాంతి బరిలో దిగేందుకు కోడి పుంజులు సిద్ధమవుతున్నాయి. శిక్షణా శిబిరాల్లో నువ్వా.. నేనా అని తలపడుతున్నాయి. పండుగ దగ్గర పడటంతో వీటి అమ్మకాలు సైతం ఊపందుకున్నాయి. నెమలి, కాకి, డేగ, అబ్రాసు, సీతువ, రసంగి, పర్ల, కెక్కి రాయి, పూల వంటి పలు జాతుల పుంజులు 'కోట్లా'టకు రెడీ అంటున్నాయి. మెట్ట ప్రాంతమైన ద్వారకాతిరుమల మండలంలోని రాళ్లకుంట, కొమ్మర, మలసానికుంట, ద్వారకాతిరుమల, దొరసానిపాడు, పంగిడిగూడెం, గుణ్ణంపల్లి, మారంపల్లి ప్రాంతాల్లో పుంజుల శిబిరాలు ఉన్నాయి.


తెల్లపర్ల

సమయం లేదు మిత్రమా

పందేల నిర్వాహకులు, శిక్షకులు కోడి పుంజులను ప్రత్యేక శ్రద్ధతో పెంచుతున్నారు. రోజూ రిహార్సల్స్ చేయిస్తూ శిక్షణ ఇస్తున్నారు. ఈ సారి కూడా పందేలు భారీగా వేసేందుకు నిర్వాహకులు సిద్ధమవుతున్నారు. సంక్రాంతి పండుగకు మరో పది రోజులు కూడా సమయం లేకపోవడంతో జిల్లా వ్యాప్తంగా హడావిడి చేస్తున్నారు.

రాజభోగమే..

పందెం పుంజులకు బాదంపప్పు, జీడిపప్పు, మటన్ కీమా, తాటిబెల్లం నువ్వుల నూనె ఉండలు వంటి బలవర్ధక ఆహారాన్ని నిత్యం అందిస్తారు. వీటి పెంపకం చూస్తే ఏమీ రాజభోగం అనిపిస్తోంది. ఉదయం 6 గంటలకు పందెం రాయుళ్లు వాటిని చెరువుల్లోను, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నీటి తొట్టెల్లో ఈదిస్తున్నారు. ఆ తరువాత వాకింగ్ చేయించి, కొద్ది సేపు ఎండలో కడుతున్నారు. 9 గంటలకు అల్పాహారంగా బాదం పప్పు, జీడిపప్పు, మటన్ కీమా లను పెడుతున్నారు. తాటి బెల్లాన్ని నువ్వుల నూనెతో కలిపి, ఉండలుగా చేసి తినిపిస్తున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు చోళ్లు, గంట్లు, ఒడ్లుతో కూడిన మేతను పెడుతున్నారు. వాటికి ఎండ తగులకుండా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షెడ్లలోని గాబుల్లో ఉంచుతున్నారు. సాయంత్రం 6 గంటలకు పొయ్యి మీద అట్లపెనం ఉంచి దానిపై చల్లిన వేడి నీటిని పుంజుల దేహంపై పూస్తున్నారు. ఆ తరువాత రెవిటాల్ వంటి బలవర్ధక మందులు వేస్తున్నారు. ఇలా రోజుకు ఒక్కో పుంజుకు రూ. 200 వరకు ఖర్చు చేస్తున్నారు. తర్ఫీదులో భాగంగా వాటికి బోలెడన్ని మెళకువలు నేర్పిస్తున్నారు. ప్రస్తుతం ఒక్కో పుంజు ధర రూ. 10 వేలు పైమాటే పలుకుతోంది.


డేగ


సీతువ


నీటి తొట్టెలో ఈదుతున్న పందెం పుంజు


జీడి, బాదం పప్పులను తింటున్న పుంజు

ఉత్సాహంగా ఉద్యాన క్రీడలు


జావెలిన్ త్రో విసురుతున్న విద్యార్థిని

తాడేపల్లిగూడెం : వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ పరిధిలోని ఉద్యాన కళాశాలల మధ్య జరుగుతున్న క్రీడలు శుక్రవారం రసవత్తరంగా సాగాయి. రెండోరోజు జరిగిన పోటీల్లో 100 మీటర్ల విభాగంలో జి.మన్మధరావు(ఉద్యాన కళాశాల, పార్వతీపురం), కె.అజయకుమార్(ఉద్యాన కళాశాల వెంకట్రామన్నగూడెం) విజేతలుగా నిలిచారు. 1500 మీటర్ల పరుగుపందెంలో పురుషుల విభాగంలో ఎస్.విజయకుమార్(ఉద్యాన కళాశాల, వెంకట్రామన్నగూడెం), మహిళల విభాగంలో బి.మనీషా(ఉద్యాన కళాశాల అనంతరాజుపేట) విజేతలయ్యారు. జావెలిన్‌త్రో విభాగంలో బి.మహేష్(ఉద్యాన కళాశాల వెంకట్రామన్నగూడెం)మహిళల విభాగంలో ఆర్.సంధ్య, ఉద్యానకళాశాల వెంకట్రామన్నగూడెంలు తొలిస్థానంలో నిలిచారు. టేబుల్ టెన్నిస్ మహిళల విభాగంలో ఆర్.నవీన మణిమాల, వి.గీత దివ్య, బి.శ్రీదేవి(ఉద్యాన కళాశాల, వెంకట్రామన్నగూడెం), హైజంప్‌లో జే.హేమంత్ (ఉద్యాన కళాశాల తాడిపత్రి) కె.ఎస్.ఇంద్ర (ఉద్యాన కళాశాల పార్వతీపురం) విజేతలుగా నిలిచారు.

8న జిల్లా స్థాయి పురుషుల ఫుట్‌బాల్ పోటీలు

సాక్షి, భీమవరం: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(శాప్) ఆధ్వర్యంలో ఈనెల 8న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఫుట్‌బాల్ నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడా అధికారి సంస్థ చీఫ్ కోచ్ పి.సురేంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరులోని ఏఎస్ఆర్ స్టేడియంలో నిర్వహించే ఈ పోటీల్లో 15 ఏళ్ల పైబడిన పురుషులు పాల్గొనవచ్చునన్నారు.

అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక


పోటీలకు ఎంపికైన విద్యార్థినిని అభినందిస్తున్న దృశ్యం

అత్తిలి : స్థానిక ఎస్వీఎస్ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియేట్ చదువుతున్న ఎస్.మౌనిక మహాలక్ష్మి జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో 400 మీటర్ల రన్నింగ్ విభాగంలో మౌనిక మహాలక్ష్మి ద్వితీయ స్థానం సాధించింది. ఈ నెల 9, 10, 11 తేదీల్లో చెన్నైలో జరిగే పోటీల్లో పాల్గొంటుంది. మహాలక్ష్మిని ఉన్నత పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ దూసంపూడి శ్రీనివాసరావు, అధ్యాపకులు అభినందించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి


తణుకులోని రైలు పట్టాలపై మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

తణుకు : రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన తణుకు రైల్వే అవుట్ పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. సుమారు 45 నుంచి 50 సంవత్సరాలు వయసు కలిగిన వ్యక్తి మృతదేహం స్థానిక బస్టాండు సమీపంలోని రైలు పట్టాలపై ఉన్నట్లు గుర్తించిన కీమాన్ రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న రైల్వే పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తెలుపు, నలుపు, సిమెంటు రంగు అడ్డచారలు కలిగిన పొడుగు చేతుల చొక్కా, ఖాకీ రంగు నిక్కరు ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు.

ప్రయాణికురాలిగా నటించి బంగారం చోరీ

తణుకు: మహిళా ప్రయాణికులే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న ఒక మహిళను శుక్రవారం తణుకు రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. ఆకివీడుకు చెందిన మేకల పోచమ్మ అలియాస్ నరమామిడి పోచమ్మను అరెస్టు చేసి ఆమె నుంచి 247 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. తణుకు రూరల్ పోలీసు స్టేషన్‌లో ఎస్పీ యు.రవిప్రకాష్ వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన నల్లం సూర్యచక్రధరరావు తన భార్య కనకదుర్గాదేవిని గత నెల 28న వేల్పూరు రోడ్డులో ఆటో ఎక్కించారు. బెంగళూరుకు వెళ్లే క్రమంలో ఇంట్లో బంగారు ఆభరణాలు బంధువుల ఇంట్లో ఉంచేందుకు ఆమె వాటిని బ్యాగులో ఉంచి ఆటో ఎక్కారు. అప్పటికే ఆమెను గమనించి వెంకట్రాయపురం పార్కు వద్ద ఒక మహిళ ఆటో ఎక్కింది. వీరభద్రపురం వద్ద ఆటో దిగి వెళ్లిపోయింది. వేల్పూరులో ఆటో దిగిన కనకదుర్గాదేవి బ్యాగులో బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూరల్ సీఐ ఆంజనేయులు దర్యాప్తు చేపట్టారు. ఆటోను వెంబడించిన కారు ఆధారంగా నిందితులను గుర్తించారు. పోచమ్మను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం చేసినట్లు అంగీకరించింది. ఆమెకు సహకరించిన మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు ఎస్పీ వెల్లడించారు. రూ. 12 లక్షలు విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు.



తణుకులో నిందితురాలిని అరెస్టు చేసి వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

నేడు గడపగడపకు ముగింపు

నరసాపురంలో పలువురు మంత్రుల హాజరు

నరసాపురం రూరల్: గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం నియోజకవర్గంలో విజయవంతమైంది. ఈ కార్యక్రమం ప్రారంభించిన నాటి నుంచి లబ్ధిదారులను కలవడంలో ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు రాష్ట్రంలో మొదటి వరుసలో నిలిచారు. శనివారం ఈ కార్యక్రమం నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం గ్రామంలో ముగుస్తుందని ప్రసాదరాజు తెలిపారు. కార్యక్రమం నియోజకవర్గంలో 146 రోజులు సాగింది. ప్రతీ సచివాలయ పరిధిలోని గడపగడపకు వెళ్లి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశామన్నారు. ఇప్పటికే నరసాపురం నియోజకవర్గంలోని 69 సచివాలయాల పరిధిలో వివిధ అభివృద్ధి పనులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా రూ.14 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఆర్అండ్‌బీ రహదారుల నిర్మాణానికి రూ.70 కోట్లు మంజూరయ్యాయన్నారు. మంచినీటి కోసం రూ.25 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఆక్వా యూనివర్సిటీ పనులు జరుగుతున్నాయని, ఈ నెలలోనే వశిష్ట బ్రిడ్జికి సంబంధించి టెండర్లు పిలుస్తారని ప్రసాదరాజు స్పష్టం చేశారు. ముగింపు సభలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, మంత్రులు మేరుగ నాగార్జున, జోగి రమేష్, మాజీ మంత్రి పేర్ని నాని తదితరులు హాజరవుతున్నారన్నారు. వీరి చేతుల మీదుగా మంజూరైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. తొలుత గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ప్రతీ గడపకూ వెళ్లి సంక్షేమ వివరాల బ్రోచర్‌ను అందించారు. కార్యక్రమంలో ఎంబీసీ కార్పోరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జెడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ, ఎంపీపీ మైలాబత్తుల సోనీ, వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్‌నాయుడు, చాగంటి సత్యనారాయణ, తిరుమాని వెంకట్రాజు, మత్తే సువర్ణరాజు, అంద్రాజు చల్లారావు తదితరులు పాల్గొన్నారు.


లక్ష్మణేశ్వరం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

ఓవరాల్ చాంపియన్‌గా సీఆర్ఆర్ కళాశాల


విజేతలకు బహుమతులు అందచేస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : స్థానిక సీఆర్ఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన రీజనల్ స్థాయి స్పోర్ట్స్, గేమ్స్ పోటీల్లో వివిధ క్రీడల్లో విజేతగా నిలిచిన సీఆర్ఆర్ పాలిటెక్నిక్ కళాశాల ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించింది. శుక్రవారం కళాశాలలో జరిగిన ముగింపు వేడుకల్లో విద్యా సంస్థల పాలకమండలి కార్యదర్శి ఎంబీఎస్వీ ప్రసాద్ మాట్లాడుతూ తమ కళాశాలలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించేందుకు అనుకూలమైన సౌకర్యాలు కల్పించామని స్పష్టం చేశారు. కరస్పాండెంట్ మామిళ్ళపల్లి జయప్రకాష్ ప్రిన్సిపాల్ అక్కినేని శివకుమార్ తదితరులు మాట్లాడారు. అనంతరం ఆయా పోటీల్లో విజేతలకు బహుమతులు అందచేశారు.

శ్రీరామ నవమి కోసం తలంబ్రాలు


మద్ది క్షేత్రంలో తలంబ్రాలను సిద్ధం చేసే కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో శుక్రవారం శ్రీరామ ఆధ్యాత్మిక సేవా సంఘం ఆధ్వర్యంలో ధాన్యం గింజలను గోటితో ఒలిచి తలంబ్రాలను సిద్ధం చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. శ్రీరామనవమి పర్వదినాన భద్రాచలంలో జరిగే సీతా రాముల కల్యాణంలో భక్తులు తలంబ్రాలను అందించనున్నారు. ప్రతీ ఏటా కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా తలంబ్రాలను శిరస్సుపై ఉంచుకుని పాదయాత్రగా వెళ్లి కల్యాణంలో అందిస్తుంటారని శ్రీరామ ఆధ్యాత్మిక సేవా సంఘం సభ్యులు తెలిపారు.

8న టెన్నికాయిట్ జట్ల ఎంపిక

నూజివీడు: కృష్ణాజిల్లా టెన్నీకాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టెన్నీకాయిట్ సబ్‌జూనియర్ బాల బాలికల జిల్లా జట్ల ఎంపికను ఈనెల 8న నూజివీడులోని డిఏఆర్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి దాసరి సూర్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3గంటల నుంచి నిర్వహించే ఈ సెలక్షన్‌లో పాల్గొనేవారు 2008 సంవత్సరం ఏప్రిల్ ఒకటి తరువాత జన్మించి ఉండాలన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు ఈ నెల 11, 12 తేదీల్లో అనకాపల్లిలో నిర్వహించే ఏపీ అంతర్ జిల్లాల టెన్నికాయిట్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించాల్సి ఉంటుందన్నారు.

ఓ చిట్టి ప్రేమకథకు ఉత్తమ అవార్డు


ఓ చిట్టి ప్రేమకథ షార్ట్ ఫిలిం నటీనటులతో నిర్మాత శివరామరాజు(ఫైల్)

ఉండి: ఉండికి చెందిన ముదునూరి శివరామరాజు, జీ.పాండురంగరావు, టీ.విజయలక్ష్మీ నిర్మించిన ఓ చిట్టి ప్రేమకథ షార్ట్ ఫిలిం ఉత్తమ షార్ట్ ఫిలిం అవార్డు గెలుచుకుందని నిర్మాత శివరామరాజు శుక్రవారం ఉండిలో తెలిపారు. 4న విశాఖపట్నంలో జరిగిన విశాఖ ఫిలిం ఫెస్టివల్‌లో అవార్డు గెలిచిన సందర్భంగా చిత్ర నటీనటుల బృందం పత్రికా ప్రకటన విడుదల చేసింది.

150 మద్యం సీసాల స్వాధీనం

నూజివీడు: మండలంలోని సుంకొల్లులో నిర్వహించిన దాడుల్లో తెలంగాణకు చెందిన 150 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ టీ.గోపాలకృష్ణ తెలిపారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ధన్‌రాజ్ ఆధ్వర్యంలో ఎస్ఐ అల్లూరయ్య సిబ్బందితో తనిఖీలు నిర్వహించగా కొనకల్ల సీతమ్మ వద్ద 150 మద్యం సీసాలను, ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఆమెను అరెస్టు చేశారు. సారాను సరఫరా చేసిన కొనకల్ల ఆంజనేయులుపై కేసు నమోదు చేశామన్నారు.

మద్యం సీసాల పట్టివేత

జంగారెడ్డిగూడెం: అనధికారికంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసి అతని నుంచి 165 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ ఇనెస్పెక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం జంగారెడ్డిగూడెం ఎస్ఈబీ సర్కిల్ పరిధిలోని కుకునూరు మండలం మాధవరం గ్రామంలో ఎస్ఈబీ అధికారులు దాడులు చేశారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన మద్యం బాటిళ్లు వాదం అంజి వద్ద ఉండటాన్ని గుర్తించి, స్వాధీనం చేసుకున్నామన్నారు. అంజిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

క్లుప్తంగా

బలుసులమ్మ అమ్మవారి ఆలయంలో విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో బలుసులమ్మవారు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారికి శుక్రవారం పౌర్ణమి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కొట్టు అంజిబాబు, ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఆరవల్లిలో ఉచిత వైద్య శిబిరం



అత్తిలి మండలం ఆరవల్లిలో వైద్యశిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: మండలంలోని ఆరవల్లి గ్రామ సచివాలయం వద్ద చైల్డ్‌ఫండ్ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం ఆదేశాల మేరకు ఈ క్యాంపు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమానికి హాజరైన డాక్టర్ పి కిరణ్, హెచ్ఐవీ పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా హెచ్ఐవీ, హెచ్‌బీఎస్ఎస్, ఆర్‌బీఎస్ వంటి రక్తపరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేసారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెలగల సుస్మిత, చైల్డ్‌ఫండ్ ఇండియా డీఆర్‌పీ జి రాజశేఖర్, జోనల్ సూపర్‌వైజర్ కె దాసుబాబు, కె సురేష్ బాబు, టి హనుమంతు, జి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన



అత్తిలి మండలం పాలిలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అత్తిలి: పాలి గ్రామంలో వేంచేసియున్న శ్రీమహంకాళమ్మ అమ్మవారి దశమ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం అమ్మవారికి విశేష పూజలు జరిపారు. ఈసందర్భంగా హాజరైన భక్తులకు అన్నదానం చేసారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆర్థిక సాయం అందజేత



దివ్యాంగులకు ఆర్థిక సహాయం, నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న మానవత సంస్థ సభ్యులు

తణుకు టౌన్: తణుకు మానవత సంస్థ ఆధ్వర్యంలో ఇద్దరు దివ్యాంగ చిన్నారులకు ఆర్థిక సహాయం అందజేసినట్లు తణుకు మానవత సంస్థ అధ్యక్షుడు ఏ సుబ్బారావు తెలిపారు. శుక్రవారం తణుకులో జరిగిన కార్యక్రమంలో తణుకు జంగం చెరువు ప్రాంతానికి చెందిన తాపీ మేస్త్రీ మోటుపల్లి శ్రీనివాస్‌కు ఇద్దరు కుమార్తెలకు పుట్టుకతోనే దివ్యాంగులు కావడంతో వారికి ఆర్థికంగా బారం కావడంతో మానవత సభ్యులు స్పందించి రూ. 5 వేలు ఆర్థిక సహాయంతో పాటు రూ. 2 వేల విలువైన నిత్యావసరాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, కె సత్యనారాయణ, రమణమూర్తి, పీ భద్రం, శివన్నారాయణ, లక్ష్మీనారాయణ, మస్తాన్‌రావు తదతరులు పాల్గొన్నారు.

ఎన్జీవోస్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జాయింట్ కమిషనర్ నాగేంద్రకుమార్ తదితరులు

తణుకు అర్బన్: వాణిజ్య పన్నుల శాఖ డీసీటీ ఎన్జీవోస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏలూరు జాయింట్ కమిషనర్ నాగేంద్రకుమార్ 2023 టేబుల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. జాయింట్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన ఈ క్యాలెండర్ ఆవిష్కరణలో డిప్యూటీ కమిషనర్ రాంబాబు, ఏలూరు డివిజన్ అధ్యక్షుడు పి.రాజేష్‌బాబు, కార్యదర్శి నాగేంద్ర, కోశాధికారి బీవీ బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.శ్వేత, జిల్లా ఉపాధ్యక్షులు కె.ప్రశాంత్, జిల్లా సహాయ కార్యదర్శులు జి.సతీష్‌కుమార్, వై.మనోజ్ఞ, వి.శ్రీనివాసరావులు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పీఎస్ సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



దోమల నివారణ మందును పిచికారి చేయిస్తున్న సబ్ యూనిట్ ఆఫీసర్, వైఎస్సార్ సీపీ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మలేరియా, డెంగ్యూ తదితర ఇతర వ్యాధులు, జ్వరాలు భారీన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు పేర్కొన్నారు. పట్టణంలో 10వ వార్డు పాతూరులో ఒకరు డెంగ్యూ జ్వరం భారీన పడటంతో ఆంధ్ర ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మలేరియా సబ్‌యూనిట్ అధికారి శుక్రవారం వార్డులో పర్యటించారు. వార్డులో పరిసరాలను పరిశుభ్రం చేయడంతో పాటు డ్రైయినేజీలలో దోమల నిర్మూలన మందులు స్ప్రే చేయించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, వార్డు ఇన్‌చార్జి అద్దాల నరసింహారావు ఆధ్వర్యంలో పరిసరాలు, పరిశుభ్రత అనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించారు. శీతాకాలం సమయంలో వ్యాధులు కలిగించే దోమలు వల్ల ప్రజలు రోగాల భారీన పడతారని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాలు మేరకు నిరంతరం చెత్త చెదారాలను వాహనాలు ద్వారా తరలిస్తున్నామని, ప్రజలు తమకు సహకరించాలని కోరారు. నివాసాలు వద్ద డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా దోమ ఉత్పత్తి కారకాలను తొలగించి, పరిశుభ్రత పాటించాలని విజ్ఞప్తి చేశారు. జ్వర అనుమానిత బాధితులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తామని, అవసరమైన వారు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అవసరమైన మందులు కూడా ఉచితంగా అందజేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు కాంతారావు, సెక్రటరీ జోగేంద్ర, సచివాలయం సిబ్బంది, వార్డు వలంటీర్లు, ఆశాలు, ఎ.ఎన్.ఎంలు మేరీ, ప్రశాంతి, జగదీష్, షబీనా, కుమారి, కనకలక్ష్మి, వెంకటలక్ష్మి, దుర్గ, గణపతి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి



తణుకులో సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి పి.అన్నపూర్ణ, చిత్రంలో న్యాయమూర్తులు

తణుకు అర్బన్: ఫిబ్రవరి 11వ తేదీన తణుకు కోర్టులో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయడానికి పోలీసు అధికారులు కృషిచేయాలని నాల్గవ అదనపు జిల్లా జడ్జి, కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి పి.అన్నపూర్ణ అన్నారు. తణుకు కోర్టులో శుక్రవారం పోలీసు అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించి రాజీ కాదగ్గ ప్రతి కేసులోను కక్షిదారులకు అవగాహన కల్పించి పరిష్కారం దిశగా పనిచేయాలని సూచించారు. దీనికి సంబంధించి సివిల్, క్రిమినల్, ప్రీలిటిగేషన్ కేసుల పరిష్కారంలో పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణ సత్యలత, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.బాబు, ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఏవీ నాగరాజు, స్పెషల్ మేజిస్ట్రేట్ పీఎస్ చిరంజీవిరావు, బార్ అసోసియేషన్ కార్యదర్శి వి.సుధాకరరావు, తణుకు సీఐ ముత్యాల సత్యనారాయణ, ఎస్సైలు పాల్గొన్నారు.

11మంది పేకాట రాయళ్ల అరెస్టు

తణుకు: తణుకు పట్టణంలో పేకాట స్థావరంపై పోలీసులు శుక్రవారం దాడి చేశారు. స్థానిక ఒకటో వార్డు అభయాంజనేయ నగర్‌లో ఒక ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారంతో సీఐ ముత్యాల సత్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేశారు. పేకాట ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ. 20,720 నగదు, పది సెల్ ఫోన్లు, అయిదు మోటారుసైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

అన్నే వెంకటేశ్వరరావు సేవలు మరువలేనివి



అన్నే వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న చింతకాయల బాబూరావు

పెంటపాడు: సీపీఎం అభ్యున్నతికి అన్నే వెంకటేశ్వరరావు చేసిన సేవలు మరువలేనివని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి చింతకాయల బాబూరావు పేర్కొన్నారు. పెంటపాడు ప్రజాసంఘాల కార్యాలయం వద్ద వెంకటేశ్వరరావు 20వ వర్ధంతి కార్యక్రమాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ స్వాంతంత్య్ర ఉద్యమంలో వెంకటేశ్వరరావు కీలకపాత్ర పోషించి అలనాడు గాంధీజీతో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారన్నారు. 12 ఏళ్ల అండమాన్‌దీవుల్లో జైలు జీవితాన్ని గడిపిన త్యాగమూర్తి అన్నారు. ఉద్యమాల ద్వారా వేలాది ఎకరాలు పేదలకు పంచడంలో కీలక భూమి పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఉపాధ్యక్షుడు శిరపరపు రంగారావు, సీపీఎం మండల కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి, పెనగంటి దుర్గ, యాంద్రపు కృష్ణ, అడపా ఆంజనేయులు, బేతిరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



తణుకు వాసవీ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో అష్ట లక్ష్మీల పోటీల దృశ్యం

తణుకు టౌన్: వాసవీ ఇంటర్ నేషనల్, వాసవీ వనితా వైభవం క్లబ్, వాసవీ క్లబ్ రాయల్ సంయుక్తంగా నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా నిర్వహించారు. శుక్రవారం మధ్యాహ్నం తణుకులోని ఆర్యవైశ్య భవన్‌లో నిర్వహించిన ఈవేడుకలలో చిన్నారులు, యువత, మహిళలు అధిక సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని వివిధ పోటీల్లో తమ ప్రతిభను చాటుకున్నారు. ఈపోటీల్లో సంక్రాంతి ముగ్గుల పోటీలు, హరిదాసులు, కీర్తల పోటీలు, భోగి మంట, అష్టలక్ష్మీ అలంకారణ పోటీలు, సంక్రాంతి చిట్టి తల్లులు, తదితర పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో జోన్ చైర్మన్ జీ రాజేశ్వరరావు, వనితా వైభవం క్లబ్ అధ్యక్షురాలు ఏ వేదకుమారి, కార్యదర్శి జే సుజాత, కోశాదికారి గూడూరి గీత, వాసవీ రాయల్స్ క్లబ్ అధ్యక్షుడు జే వీరభద్రయ్య, కార్యదర్శి కందుల చంద్రమౌళి గుప్త, కోశాధికారి కట్టమూరి మురళీలతో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను సత్కరించారు. ఈ పోటీల్లో పాల్గొన్న విజేతలందరికీ బహుమతులను అందజేశారు.

రైతులు పంట వివరాలను నమోదు చేసుకోవాలి



రైతుల పంట వివరాలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు

తణుకు టౌన్: రైతులు తమ పంట సాగుకు సంబంధించిన వివరాలను (ఈకేవైసీ) వెంటనే నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వరరావు కోరారు. శుక్రవారం తణుకు రూరల్ మండలం ముద్దాపురం గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌బీకేలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం పొలాలను సందర్శించి రైతులను పంట వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈకేవైసీ ద్వారా రైతులకు పంటల నష్ట పరిహారంతో పాటు పంటల బీమా, సున్నావడ్డీ, వంటి ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని చెప్పారు. తణుకు మండలంలో మొత్తం 4 వేల ఎకరాలలో దాళ్వా సాగు చేస్తుండగా వాటిలో 2,100 ఎకరాలలో పంట నమోదు చేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఏడీఏ ఎంవీ రమేష్, ఏవో కె కుసుమ, ఏఈవో టీ వీరభద్రుడు, వీఏఏ సత్యవాణి, రైతులు పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు తప్పవు



పెంటపాడు గ్రామంలో రెవిన్యూ, గ్రామ పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

పెంటపాడు: సంక్రాంతి పండుగ పురస్కరించుకొని మండలంలో అసాంఘీక నేరాలకు పాల్పడితే వారిపై చర్యలు తప్పవని తహసీల్దార్ జీవీ శేషగిరిరావు హెచ్చరించారు. పెంటపాడు మండలంలో అక్రమంగా కోడిపందేలు, జూదం, మద్యం నిర్వహించకుండా ముందస్తు చర్యల్లో భాగంగా శుక్రవారం రెవిన్యూ, పంచాయతీల ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి పెంటపాడులోని పలు ప్రాంతాలు, జట్లపాలెం గ్రామాల్లో గ్రామస్తులతో అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కోడిపందేలకు సంబంధించి ఎవరివైనా భూములు చదును చేసి బరులు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకొంటామన్నారు. ఆర్ఐ కనకదుర్గ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ పురస్కరించుకొని కుటుంబసభ్యులతో ఆనందంగా పండుగను జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళా సంరక్షులతో పాటు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి నల్లమిల్లి విజయానందరెడ్డి, గ్రామ కార్యదర్శి అనిల్‌కుమార్, పెంటపాడు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బంకుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు



తణుకులోని పెట్రోల్ బంకుల్లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

తణుకు: తణుకు పట్టణంలోని పలు పెట్రోల్ బంకుల్లో తూనికలు కొలతలు శాఖ అధికారులు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. తణుకు, అత్తిలి ప్రాంతాల్లో నిర్వహించిన ఈ తనిఖీల్లో భాగంగా బంకుల్లో పలు రికార్డులను తనిఖీలు చేసి పెట్రోల్, డీజిల్ నిల్వలను పరిశీలించారు. కాకినాడకు చెందిన తూనికలు కొలతలు శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ సయ్యద్ సలీం, ఇన్‌స్పెక్టర్ మోహన్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెట్రోల్ బంకుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోస్టాఫీస్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

అత్తిలి: ఈనెల 18 వరకు భారత తపాలాశాఖ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రజలు అధిక మొత్తంలో పొదుపు చేసుకోవాలని సీహెచ్‌వీ సుబ్బారావు తెలిపారు. కేంద్రం వడ్డీ రేట్లను మార్చి నెలాఖరు వరకు పెంచిన కారణంగా ప్రజలు పోస్టాఫీస్‌లో పొదుపు చేసుకుని లబ్ధి పొందాలని కోరారు. 10 ఏళ్లలోపు ఆడపిల్లలకు సుకన్య సమృద్ధి ఖాతాను ప్రారంభించుకోవచ్చన్నారు. గతంలో సుకన్య అకౌంట్ తీసుకున్న వారు, ఒక వాయిదా మాత్రమే కట్టినవారు తమ పాస్‌బుక్ తీసుకుని మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు పోస్టాఫీస్‌లో పరిశీలన చేసుకోవాలని కోరారు. తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా పాలసీలను తక్కువ ప్రీమియంతో అధిక బోనస్‌ను పాలసీదారులకు అందజేస్తోందని చెప్పారు. సంక్రాంతి సంబరాల్లో తపాలాశాఖ ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సుబ్బారావు కోరారు.

పెన్షన్ల పెంపుతో ఆనందం



వెంప గ్రామంలో కొత్తగా మంజూరైన పెన్షన్ అందజేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: పెన్షన్లు పెంపుతో అవ్వతాతలు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పరిపాలన పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అల్లూరి కృష్ణంరాజు, సొసైటీ త్రి సభ్య కమిటీ చైర్మన్ కలిదిండి మురళీకృష్ణంరాజులు అన్నారు. భీమవరం మండలంలోని వెంప గ్రామంలో నూతనంగా మంజూరైన పెన్షన్‌దారులకు శుక్రవారం నగదును అందజేశారు. ఈ సందర్భంగా అల్లూరి కృష్ణంరాజు, కలిదిండి మురళీకృష్ణంరాజులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మాట ఇచ్చాడంటే కచ్చితంగా నెరవేరుస్తారని, అదే విశ్వాసంతో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు ఉన్నారన్నారు. మూడున్నరేళ్లలో ఎన్నికలలో ఇచ్చిన హామీలను 98 శాతంపైగా అమలు చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నియోజకవర్గ అభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు. జల జీవన్ మిషన్ ద్వారా సుమారు రూ. 40 కోట్లు, యనమదుర్రు డ్రైయిన్‌పై మూడు బ్రిడ్జిలకు అప్రోచ్‌లు నిమిత్తం రూ.36 కోట్లు, తాడేరు వంతెన నిర్మాణానికి రూ. 2 కోట్ల 50 లక్షలు, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలు, నాడు, నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధికి రూ.22 కోట్ల నిధులను తీసుకువచ్చారన్నారు. జిల్లా కేంద్రంగా భీమవరాన్ని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తీసుకురావడం మన అదృష్టమన్నారు. ఇంకా ఎన్నో శాశ్వత అభివృద్ధి పథకాలు గ్రామాలలో చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు చిలకపాటి కుమారి, కలిదిండి అప్పలరాజు, దాట్ల శ్రీనివాసరాజు, కార్యదర్శి కృష్ణ మోహన్, పెన్షన్ దారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయురాలిని విచారించిన డీవైఈవోలు

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని గూట్లపాడులో మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.శివ నాగజ్యోతిని శుక్రవారం తాడేపల్లిగూడెం, భీమవరం డీవైఈవోలు రవీంద్ర భారతి, శ్రీరామ్, విస్సాకోడేరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి వాణి విజయరత్నంలు విచారించారు. గతంలో ప్రధానోపాధ్యాయురాలు పాఠశాలలో పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలలో విధులు నిర్వహిస్తున్న దాసి లక్ష్మీ ప్రసన్నను కులం పేరుతో దూషించినట్లు ఆరోపణలు వచ్చాయి. అదే కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న చీడే సత్యవాణి కలుగజేసుకుని ఎందుకు తిడుతున్నారని ప్రశ్నించంగా సెల్‌ఫోన్ లాక్కుని వారిపై దాడి చేసినట్లు ఫిర్యాదు అందింది. శుక్రవారం పాఠశాలకు వచ్చి ఇరు వర్గాలను విచారించారు. డీవైఈవోలు మాట్లాడుతూ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కొప్పర్తి సత్యనారాయణ, సర్పంచ్ భర్త ఒడుగు ముత్యాలరావు, గ్రామ పెద్దలు మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయురాలు చాలా సార్లు విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై దురుసుగా మాట్లాడటంతో గతంలో ఎన్నోసార్లు పెద్దల సమక్షంలో పలు సమస్యలను పరిష్కరించామని ఆమె తీరు మార్చుకోవడం లేదని చెప్పారు.

ఖోఖో పోటీలకు తణుకు విద్యార్థినుల ఎంపిక



యూనివర్సిటీ ఖోఖో పోటీలలో విజేతలైన విద్యార్థినులతో కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

తణుకు టౌన్: ఈనెల 5 కాకినాడ ఏఎస్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ మహిళా ఖోఖో ఇంటర్ కాలేజియేట్, యూనివర్సిటీ ఎంపిక పోటీల్లో తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాలకు చెందిన విద్యార్థినులు తృతీయ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ కె రామకృష్ణ తెలిపారు. ఈపోటీల ద్వారా తమ కళాశాల విద్యార్థినులు పీ రమ్య, ఎల్ కుసుమలు ఈనెల 27 నుంచి 29 వరకూ కొల్హాపూర్‌లోని శివాజీ యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ మహిళా ఖోఖో పోటీలకు యూనివర్సిటీ జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థునులను, సౌత్ జోన్‌కు ఎంపికైన విద్యార్థునులను కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు, ఏవో డా.డీ సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ యూ లక్ష్మీసుందరిబాయి, పీడీలు ఎం రత్నకుమారి, ఇతర అధ్యాపక సిబ్బంది అభినందించారు.

బీడీసీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చీర్ల పద్మశ్రీ



తణుకులో జరిగిన గ్రంథాలయ ఉద్యోగుల సమావేశంలో చైర్మన్ చీర్ల పద్మశ్రీ, చీర్ల రాధయ్యలను సత్కరిస్తున్న ఉద్యోగులు

తణుకు టౌన్: జిల్లా పుస్తక పంపిణీ కేంద్రాల నిర్వాహకులుగా (బీడీసీలుగా) పని చేస్తున్న వారి సమస్యలను వెంటనే పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చీర్ల పద్మశ్రీ చెప్పారు. శుక్రవారం పైడిపర్రు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ క్యాంప్ కార్యాలయంలో జరిగిన జిల్లా పుస్తక పంపిణీ కేంద్రాల నిర్వాకులకు నిర్వహించిన ముఖాముఖీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పుస్తక పంపిణీ నిర్వాహకులు కోరిన పలు డిమాండ్‌ల్లో రెండు మినహాయించి మిగిలిన పది డిమాండ్‌లను అమలు చేయడానికి హామీ ఇచ్చారు. వీటిలో ముఖ్యంగా బీడీసీలకు గుర్తింపు కార్డులు మంజూరు చేయడం, టీఏ బిల్లు అమలు చేయడం, స్టేషనరీ బిల్లులు ఇస్తామని, హామీ ఇచ్చారు. జీతాలు పెంచే విషయంలో, సెలవులు మంజూరు విషయంలో ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలసి వుందని చెప్పారు. జిల్లాలో ఖాళీగా వున్న బీడీసీ పోస్టులను, కొత్త పోస్టులను వెంటనే భర్తీ చేస్తామని చెప్పారు. బీడీసీలను ప్రభుత్వ కార్యాలయాల్లోనే నిర్వహించాలని, పాఠశాలల్లో నిర్వహించకూడదని, అటువంటి ఏమైనా ఉంటే వెంటనే మార్చుకునేందుకు అనుమతి ఇస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా సంస్థ చైర్మన్‌గా పదవీ చేపట్టి సంవత్సరం పూర్తైన సందర్భంగా జిల్లాలోని బీడీసీలు శుభాకాంక్షలు తెల్పుతూ కేక్‌ను కట్ చేశారు. అనంతరం చైర్మన్ పద్మశ్రీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు చీర్ల రాధయ్యలను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శేఖర్‌బాబును సత్కరించారు. ఈకార్యక్రమంలో జిల్లాలోని గ్రంథాలయ గ్రంథ పాలకులు, సంఘ అధ్యక్ష, కార్యదర్శులు, బీడీసీలు పాల్గొన్నారు.